సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం। 22। నవంబర్। 2023



రాముడినే మోసం చేశారు..

భద్రాద్రి రామయ్యను మోసం చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని టీపీసీసీ నేత పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. 10లో



పత్తి రైతుల ఆశలు గల్లంతు

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు పత్తి దిగుబడిపై ప్రభావం చూపగా.. సాగు చేసిన రైతుల ఆశలు గల్లంతయ్యాయి. 12లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
30° / 23°

జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో బుధవారం తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కనులపండువగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం కనుల పండువగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని ఆంయజనేయస్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

మూడు రోజులు తేలికపాటి వర్షాలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో వచ్చే మూడు రోజులు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణమ్మ, వాతావరణ పర్యవేక్షకులు సుమన్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్ వాతావరణ కేంద్రం సమాచారం మేరకు తూర్పు గాలుల్లో ద్రోణి వ్యాపించి ఉందని, దీంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. రైతులు వరికోతలు వాయిదా వేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కోసిన ధాన్యం తడవకుండా భద్రపర్చుకోవాలని తెలిపారు.

నేడు మణుగూరులో ఈటల కార్నర్ మీటింగ్



మణుగూరుటౌన్: బీజేపీ (భారతీయ జనతా పార్టీ) చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ బుధవారం పినపాక నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మణుగూరు పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్నర్ మీటింగ్‌కు హాజరవుతారని ఈ సమావేశానికి బీజేపీ అభిమానులు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పట్టణ అధ్యక్షుడు లింగపల్లి రమేశ్ ఓ ప్రకటనలో కోరారు.

అటానమస్ హోదా పొడిగింపు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలకు అటానమస్ హోదాను మరో పదేళ్లు పొడిగించారు. ఈమేరకు 2033 వరకు హోదా కొనసాగుతుందని పేర్కొంటూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి ఉత్తర్వులు జారీ అయినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ మహమ్మద్ జకీరుల్లా తెలిపారు.

గెలిపించకున్నా మేం అలగలేదు..





మధిర ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొన్న ఎంపీ నామా నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎమ్మెల్సీ తాతా మధు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ తదితరులు (ఇన్‌సెట్) సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, పక్కన మధిర అభ్యర్థి లింగాల కమల్‌రాజ్

- దళితబంధు కోసం భట్టి అడగలే.. ఎవరూ ధర్నాలు చేయలే
- చింతకాని మండలం దళితబంధుతో బాగుపడింది
- కమల్‌రాజ్‌ను గెలిపిస్తే నియోజకవర్గమంతా అమలు
- భట్టిని గెలిపిస్తే మధిరకు వచ్చేది ఏమీ లేదు
- రాములునాయక్‌కు సముచిత స్థానం కల్పిస్తాం
- మధిర, వైరా ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్

సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'రెండుసార్లు మధిరలో మమ్మల్ని గెలిపించలేదు. అయినా మీ మీద అలగలేదు. మధిర నాది.. తెలంగాణ రాష్ట్రంలో ఏ ఇంచు అయినా నాదే. ప్రతీ ఇంచు బాగుపడాల్సిందే. ఎక్కడ ధాన్యం పంట పెరిగినా.. పది మంది ముఖాలు కళకళలాడినా నాకు గర్వమే కదా! రాష్ట్ర నాయకత్వానికి ఉండాల్సిన సోయి కదా అది. ఇక్కడ భట్టి విక్రమార్క ఉన్నడని పక్షపాతం పట్టలేదు. చింతకాని మండలం నుంచి నాకు ఎవరూ దరఖాస్తు పెట్టలే, ధర్నాలు చేయలే. అయినా చింతకాని మండలంలో 3,400 కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున దళిత బంధు ఇచ్చాం. అలాంటప్పుడు దళితబిడ్డలు మళ్లీ ఎందుకు కాంగ్రెస్‌కు ఓట్లు గుద్దాలి. భట్టి విక్రమార్కకు ఓటేస్తే వచ్చేది ఏముంది? నియోజకవర్గానికి ఆరునెలలకోసారి చుట్టపు చూపుగా వచ్చే మనిషికి బదులు కమల్‌రాజ్‌ను గెలిపిస్తే మధిర నియోజకవర్గమంతా దళితబంధు అమలుచేస్తాం. వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌కు సముచిత స్థానం కల్పిస్తాం.' అని మధిర, వైరాల్లో మంగళవారం జరిగిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ వెల్లడించారు. ఓ వైపు భట్టి విక్రమార్కపై తీవ్ర విమర్శలు గుప్పిస్తూ.. మరోవైపు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ సాగిన ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే...

చెప్పినట్లుగానే బోనకల్‌కు దళితబంధు..

రాళ్ల వాన పడి మక్క చేను పోతే చూడడానికి బోనకల్ మండలానికి వచ్చా. గతంలో తుఫాన్ వచ్చి పంటలు దెబ్బతింటే చేతులు దులుపుకున్నరు. కేంద్రప్రభుత్వానికి రిపోర్టు ఇస్తే ఎకరానికి రూ.1,500లో, రూ.3వేలో వచ్చేవి. కానీ నేను మక్క చేలోనే నిలబడి ఎకరానికి రూ.10వేలు ప్రకటన చేశాం. తిరిగి వస్తుంటే 25 మంది దళిత ఆడబిడ్డలు నా కారు ఆపారు. మా మండలానికి దళితబంధు పెట్టండి.. ఇదివరకటిలా మేము లేం.. మారిపోయాం అన్నారు. దీంతో బోనకల్‌కు దళితబంధు ప్రకటించాం. కమల్‌రాజ్‌ను గెలిపిస్తే మధిర నియోజకవర్గమంతా దళితబంధు ఇచ్చే బాధ్యత నేనే తీసుకుంటా.

కాంగ్రెస్ రైతుబంధు వేస్ట్ అంటోంది..

రైతులకు రైతుబంధు ఇవ్వడం వేస్ట్ అని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నరు. రైతుబంధు వేస్టా.. మీరే చెప్పండి. కమల్‌రాజ్ గెలిస్తే రైతుబంధు ఉంటది. ఈ పదాన్ని పుట్టించిందే కేసీఆర్. రైతులకు సపోర్ట్ చేయాలని కలలో కూడా కాంగ్రెసోళ్లు ఆలోచించలేదు. 24 గంటలు కరెంట్ ఇస్తుంటే మూడు గంటలే చాలంటున్నరు. మూడు గంటలకు పొలం పారుతుందా? కమల్‌రాజ్ గెలిస్తే కరెంట్ 24 గంటలు ఉంటది. కాంగ్రెస్ గెలిస్తే కాటకలుస్తది. నాడు చిల్లకల్లు నుంచి మధిరకు కరెంట్ వస్తే రోజూ బ్రేక్‌డౌనే.. దాన్ని మార్పించి ఖమ్మం నుంచి డైరెక్ట్ కరెంట్ లైన్ పెట్టించా. దీంతో మధిరకు నాణ్యమైన కరెంట్ వస్తోంది.

కత్తి ఇవ్వకుండా యుద్ధం ఎలా?

కొట్లాడే వారికే కత్తి ఇవ్వాలి. కానీ కత్తి ఒకరికి ఇచ్చి.. యుద్ధం మరొకరిని చేయమంటారా? ప్రజల పక్షాన ఉన్న వారికే కత్తి ఇవ్వాలి. వైరాలో కత్తి బానోత్ మదన్‌లాల్ చేతికి ఇవ్వండి 24 గంటల కరెంట్ వస్తది. గ్రామపంచాయతీగా ఉన్న వైరాను మున్సిపాలిటీగా చేసి బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నాం. ఈ నియోజకవర్గంలో 45 తండాలను గ్రామపంచాయతీలుగా చేసుకున్నాం. సీతారామ ప్రాజెక్టు పూర్తయితే వైరాకు కూడా గోదావరి నీళ్లు వస్తాయి. జూలూరుపాడు, ఏన్కూరు, కారేపల్లిలో బాధలు పోతాయి. కొన్ని కారణాలతో రాములునాయక్‌కు టికెట్ ఇవ్వకున్నా సహకరించారు. ఆయనకు సముచిత స్థానం కల్పిస్తాం. వైరా రిజర్వాయర్‌లో నీళ్లు లేకపోతే ఎంపీ నామ నాగేశ్వరరావు అడిగిన వెంటనే ఇచ్చాం. ఇది కాంగ్రెస్‌కు సాధ్యం అవుతుందా?

ముగిసిన ప్రజా ఆశీర్వాద సభలు

మధిర, వైరాల్లో నిర్వహించిన సభలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీఎం కేసీఆర్ ప్రచార పర్వం ముగిసింది. అక్టోబర్ 27న పాలేరు నియోజకవర్గంలో ప్రజాఆశీర్వాద సభలు మొదలుకాగా... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొమ్మిది సభలు నిర్వహించడంతో పది నియోజకవర్గాలు కవర్ అయ్యాయి. అన్ని నియోజకవర్గాల్లో సీఎం సభలు నిర్వహించగా బీఆర్‌ఎస్ కేడర్‌లో జోష్ నెలకొంది. సీఎం కేసీఆర్ ప్రసంగాలు ప్రజలను ఆకట్టుకున్నాయని అభ్యర్థులు, పార్టీ నాయకులు ఆనందంగా ఉన్నారు. ఇప్పటికే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కేటీఆర్ రోడ్ షోలో పాల్గొనగా.. ఖమ్మం జిల్లాలో కూడా రోడ్ షోకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఈ సభల్లో ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, తాతా మధు, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, వైరా ఎమ్మెల్యే రాములునాయక్, ఎమ్మెల్యే అభ్యర్థులు లింగాల కమల్ రాజ్, బానోతు మదన్‌లాల్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, నాయకులు గుండాల కృష్ణ, చింతనిప్పు కృష్ణచైతన్య, మధిర మున్సిపల్ చైర్మన్ మొండితోక లత, డీసీసీబీ వైస్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధిరతో పంచాయితీ పెట్టుకుంటా..

మధిర ఆయకట్టుకు కృష్ణ నీళ్లు తక్కువ పడుతుంటాయి. ఖమ్మం జిల్లాలో పెద్ద పెద్ద నాయకులున్నారు. ఒక్కరన్నా దీని గురించి ఆలోచించారా? ఖమ్మం జిల్లాకు ఆనుకుని గోదావరి పారుతోంది. లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తది. దుమ్ముగూడెం దగ్గర ఎత్తుకోవాలి.. పోసుకోవాలని ఎవరైనా ఆలోచించారా? సీతారామ ప్రాజెక్టు ఏడెనిమిది మాసాల్లో పూర్తవుతుంది. అప్పుడు పాలేరు రిజర్వాయర్‌కు లింక్ అవుతుంది. 37 టీఎంసీల సీతమ్మసాగర్ వస్తుంది. సీతమ్మసాగర్ అయిపోతే మధిర నియోజకవర్గం వైపు కరువు అనేది తొంగిచూడదు. 365 రోజులు నిండా నీళ్లే ఉంటాయి. ఇంత మంచి ప్రణాళికలతో ముందుకుపోయే బీఆర్‌ఎస్‌ను ఓడకొట్టుకుంటే, పట్టి లేని భట్టి విక్రమార్కను గెలిపిస్తే వచ్చేది లేదు. ఈసారి మధిర వాళ్లతో పంచాయితీ పెట్టుకుంటా. రెండు సార్లు ఓడించినా మీ మీద అలగలేదు. మీ మీద మేము మంచి గౌరవంగానే పోతున్నాం. ఎట్లాగూ బీఆర్‌ఎస్ గవర్నమెంట్ వస్తుంది కాబట్టి.. బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తేనే మీకు లాభం.



మధిర సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు, ప్రజలు

మధిర, వైరా సభ హైలెట్స్

- మధిర సభకు హాజరైన సీఎం కేసీఆర్ హెలీకాఫ్టర్ మధ్యాహ్నం 1–24 గం.కు ఆగింది. ఆ సమయంలో నిమిషం పాటు చిరు జల్లులు కురిసినా వెంటనే ఆగిపోయాయి.
- 1–27 గంటలకు హెలిప్యాడ్ వద్ద ప్రత్యేక బస్సు ఎక్కిన సీఎం, 1–31 గంటలకు వేదికపైకి చేరుకున్నారు.
- 1–32 గంటల నుంచి ఆరు నిమిషాల పాటు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ మాట్లాడారు.
- 1–38 గంటలకు సీఎం కేసీఆర్ ప్రసంగం ప్రారంభించి 36 ని.ల పాటు మాట్లాడారు.
- 2–12 గంటలకు బస్సు ఎక్కి హెలీప్యాడ్‌కు చేరుకోగా 2–19 గంటలకు హెలికాప్టర్ వైరాకు బయలుదేరింది.
- వైరాలో సీఎం కేసీఆర్ హెలికాప్టర్ 2–31 దిగింది.
- 2–33 గంటలకు కారులో బయలుదేరిన ఆయన ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారితో కలిసి సభావేదికపైకి వచ్చారు.
- సభ ప్రారంభానికి ముందు కార్యకర్తలు పలచగా కనిపించినా సభ ప్రారంభమయ్యాక భారీగా చేరుకున్నారు.
- సభకు వచ్చేవారి వాహనాలను పల్లిపాడు సెంటర్‌లోనే పోలీసులు నిలిపేయడంతో 2కి.మీ. మేర కాలినడకన వచ్చారు.
- సీఎం కేసీఆర్ వేదికపైకి రావడానికి ముందు ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ మదన్‌లాల్, నాయకుడు మానవతారాయ్ మాట్లాడారు.
- సభాస్థలి పక్కన వేదికపై కళాకారులు ఆడిపాడుతుండగా, ప్రజలు కూడా నృత్యం చేశారు. వేదికపై బీఆర్‌ఎస్ అభ్యర్థి మదన్‌లాల్ కూడా నృత్యం చేశారు.
- 3–10 గంటలకు సభా ప్రాంగణం నుంచి బయలుదేరిన సీఎం కేసీఆర్ హెలీప్యాడ్‌కు చేరుకోగా, 3–16 గంటలకు హెలికాప్టర్ డోర్నకల్ బయలుదేరింది.
- సభా ప్రాంగణంలో ఎవరైనా అస్వస్థతకు గురైతే చికిత్స చేసేందుకు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు.

– మధిర/ఎర్రుపాలెం/వైరా

అభినవ అంబేడ్కర్ కేసీఆర్

– బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్



మధిర: చింతకాని మండలంలో ప్రతీ దళిత కుటుంబానికి దళితబంధుద్వారా రూ.10 లక్షలు ఇచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అభినవ అంబేడ్కర్‌గా ప్రజలు కీర్తిస్తున్నారని మధిర బీఆర్‌ఎస్ అభ్యర్థి లింగాల కమల్‌రాజ్ అన్నారు. మధిరలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని చింతకాని మండలానికి పూర్తిస్థాయిలో దళితబంధు అమలుచేయడం, ఆతర్వాత బోనకల్ మండలాన్ని ఎంపిక చేయడంపై సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే భట్టి విక్రమార్క మధిర అభివృద్ధిని పట్టించుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో మధిరను మున్సిపాలిటీగా చేసి అభివృద్ధి చేయకుండా వదిలేశారన్నారు. స్థానిక ఎమ్మెల్యే అడగకపోయినా సత్తుపల్లితో పాటు మధిరకు వంద పడకల ఆస్పత్రిని ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేశారన్నారు. అలాగే, ముఖ్యమంత్రి ఆశీస్సులతో మధిర పట్టణంలో రూ.150 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ముఖ్యమంత్రి తనకు జెడ్పీ చైర్మన్‌గా అవకాశమిస్తే ప్రజల మధ్యే ఉంటూ, కార్యకర్తల కష్టసుఖాల్లో పాలుపంచుకున్నానని చెప్పారు. ఈనెల 30న జరిగే ఎన్నికల్లో మధిర ప్రజలు తనను ఆశీర్వదించాలని, తద్వారా నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని కమల్‌రాజ్ తెలిపారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయండి

జిల్లా ఎన్నికల అధికారి ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీ చేయాలని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వెబ్‌కాస్టింగ్ ద్వారా వాహనాల తనిఖీ, బార్‌కేడింగ్, సిబ్బంది విధుల నిర్వహణ ప్రక్రియను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిలో భాగంగా జిల్లాలోని అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో 15 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటి వద్ద 24 గంటలూ పనిచేసేలా సిబ్బందిని మూడు బృందాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. చెక్‌పోస్టుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. వాహనాలను తనిఖీ చేసేప్పుడు వీడియో తీయించాలని సూచించారు. కార్యక్రమంలో వెబ్ కాస్టింగ్ నోడల్ అధికారి సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్, జాయింట్ ప్రధాన ఎన్నికల అధికారి సర్ఫరాజ్ అహ్మద్, లోకేష్‌కుమార్, ఇతర అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా జిల్లా నుంచి ప్రియాంక ఆల పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ప్రతిరోజు అందజేస్తున్న నివేదికలు, ఎన్నికలు నిర్వహణకు తీసుకుంటున్న చర్యల గురించి వారికి వివరించారు.



వెబ్‌కాస్టింగ్ ట్రయల్స్‌ను పరిశీలిస్తున్న ప్రియాంక

కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట చర్యలు

పాల్వంచ : కౌంటింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రియాంక ఆల అన్నారు. స్థానిక అనుబోస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కౌంటింగ్ కేంద్రంలో ఐరన్ మెష్ ఏర్పాటు చేయాలని రిటర్నింగ్ అధికారులకు సూచించారు. కేంద్రంలోకి వాహనాల అనుమతి లేదని, ఆరుబయటే నిర్దేశించిన ప్రదేశంలో పార్కింగ్ చేయాలని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏర్పాట్ల పర్యవేక్షణ బాధ్యతలను ఆర్‌అండ్‌బీ ఈఈ భీమ్లా, సర్వే ల్యాండ్ రికార్స్ ఏడీ కుసుమ కుమారికి అప్పగించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎ.స్వామి, అధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 268 ఓట్లు

తొలిరోజు ఓటేసిన 209 మంది వృద్ధులు.. 59 మంది దివ్యాంగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు వేసే విధానాన్ని ఈ ఏడాది ఎన్నికల సంఘం అమలు చేస్తోంది. జిల్లాలో ఈ ప్రక్రియ మంగళవారం ప్రారంభం అయింది. ఇందుకోసం బీఎల్‌ఓల ద్వారా 484 మంది వృద్ధులు, 241 మంది దివ్యాంగులు, ఎసెన్షియల్ ఆల్ సర్వీస్ ఓటర్లు 41 మంది.. మొత్తం 766 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికీ ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించగా మొదటి రోజున 209 మంది వృద్ధులు, 59 మంది దివ్యాంగులు..



కొత్తగూడెంలో వృద్ధురాలితో ఓటు వేయిస్తున్న ఎన్నికల సిబ్బంది

మొత్తం 268 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. పినపాక నియోజకవర్గంలో 54 మంది వృద్ధులు, 54 మంది దివ్యాంగులు ఉండగా, ఇంకా అక్కడ పోలింగ్ ప్రారంభం కాలేదు. ఇల్లెందు నియోజకవర్గంలో 108 మంది వృద్ధులు, 35 మంది దివ్యాంగులు ఉండగా.. మొదటి రోజు 44 మంది వృద్ధులు, 9 మంది దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. అశ్వారావుపేటలో 126 మంది వృద్ధులు, 48 మంది దివ్యాంగులకు గాను 82 మంది వృద్ధులు, 28 మంది దివ్యాంగులు ఓటు వేశారు. భద్రాచలంలో 86 మంది వృద్ధులు, 52 మంది దివ్యాంగులు, 41 మంది సర్వీస్ ఓటర్లు ఉండగా 59 మంది వృద్ధులు, 43 మంది దివ్యాంగులు, 16 మంది సర్వీస్ ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెంలో 110 మంది వృద్ధులు, 52 మంది దివ్యాంగులకు 40 మంది వృద్ధులు, ఆరుగురు మంది దివ్యాంగులు ఓటు వేశారు.

ఏటికి ఎదురీత

- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ తరఫున బరిలో జలగం
- గతంలో ఖమ్మం నుంచి పోటీ.. తృటిలో చేజారిన విజయం
- సింహం గర్జించేనా.. విజయం వరించేనా ?



సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మాజీ ఎమ్మెల్యే జలగం వెంకటరావు మరోసారి ఏటికి ఎదురీదుతున్నారు. బలమైన రాజకీయ నేపథ్యం అండగా ఉన్నా.. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున ఈసారి ఎన్నికల బరిలో దిగుతున్నారు. 20 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఇటు ప్రధాన పార్టీల తరఫున, అటు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన అనుభవం వెంకటరావుకు ఉంది. గతంలో రెండుసార్లు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ (టీఆర్‌ఎస్) తరఫున అసెంబ్లీలో అడుగు పెట్టారు. ఒకసారి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అయితే ఈసారి అటు ప్రధాన పార్టీల తరఫున కాకుండా, ఇటు ఇండిపెండెంట్‌గా కాకుండా అనూహ్యంగా జిల్లాలో పెద్దగా ప్రభావం చూపలేని ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున పోటీ చేస్తున్నారు. దీంతో గత చరిత్ర పునరావృతం అవుతుందా? లేక గెలిచి కొత్త చరిత్ర సృష్టిస్తారా ? అనే చర్చ కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జరుగుతోంది.

మళ్లీ వనమాకే టికెట్ ..

2018 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు చేతిలో కారు గుర్తుపై పోటీ చేసిన వెంకటరావు ఓడిపోయారు. అనంతరం వనమా బీఆర్‌ఎస్‌లో చేరడంతో 'గూడెం' గులాబీ వనంలో కొత్త జగడం మొదలైంది. అప్పటికే వనమా ఎన్నిక చెల్లదంటూ హైకోర్టులో జలగం కేసు దాఖలు చేశారు. ఈ విషయంలో వెనక్కు తగ్గాలని బీఆర్‌ఎస్ పెద్దలు చేసిన సూచనను ఆయన లెక్క చేయలేదు. దీంతో క్రమంగా కారు పార్టీతో దూరం పెరుగుతూ వచ్చింది. మరోవైపు అనర్హత కేసు విషయమై సుప్రీంకోర్టులో తుది తీర్పు వెలువడలేదు. ఈ సమయంలో ఎన్నికల షెడ్యూల్ రావడంతో బీఆర్‌ఎస్ వనమాకే టికెట్ కేటాయించింది. దీంతో జలగం వెంకటరావు ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తరఫున చివరి రోజున నామినేషన్ దాఖలు చేశారు.

2004 నుంచి వెంకటరావు ప్రస్థానం..

జలగం వెంకటరావు రాజకీయ ప్రస్థానం 2004లో మొదలైంది. అప్పట్లో జిల్లా రాజకీయాల్లో పెద్ద దిక్కుగా ఉన్న తుమ్మల నాగేశ్వరరావును ఓడించి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించారు. అయితే ఆ తర్వాత ఎన్నికల సమయానికి సత్తుపల్లి సీటు ఎస్సీకి రిజర్వ్ అయింది. జనరల్ స్థానమైన ఖమ్మం నుంచి పోటీకి ఆయన ఆసక్తి చూపించగా కాంగ్రెస్ టికెట్ ఇవ్వలేదు. దీంతో 2009 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓడిపోయారు. అనంతరం జలగంపై కాంగ్రెస్ పార్టీ సస్పెన్షన్ వేటు వేసింది. తదనంతర పరిణామాల్లో ఆయన వైఎస్సార్‌సీపీ మీదుగా బీఆర్‌ఎస్‌లోకి వెళ్లి కొత్తగూడెం నుంచి 2014 సాధారణ ఎన్నికల్లో గెలుపొందారు. అనంతరం 2018లో వనమా వెంకటేశ్వరరావు చేతిలో ఓటమి తర్వాత ఆయన రాజకీయ జీవితంలో మరోసారి ట్విస్టులు మొదలయ్యాయి.

'సింహం' గర్జించేనా..

70 ఏళ్ల రాజకీయ ప్రయాణంలో జలగం కుటుంబానికి గెలుపోటములు కొత్త కాదు. ప్రస్తుతం ఆ కుటుంబం నుంచి జలగం వెంకటరావు ఒక్కరే ప్రత్యక్ష రాజకీయాల్లో ఉన్నారు. మిగిలిన రాజకీయ నాయకులకు భిన్నమైన శైలి వెంకటరావుది. ఎక్కువ మాట్లాడరు, ప్రజల్లో పెద్దగా కలిసిపోరనే విమర్శలు ఆయనపై ఉన్నాయి. ఇదే సమయంలో విజన్ ఉన్న లీడర్‌గానూ గుర్తింపు ఉంది. టూరిస్టు పొలిటీషియన్ అంటూ ప్రత్యర్థులు ఆయనపై విమర్శల బాణాలు ఎక్కుపెడుతుండగా, గతంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటెయ్యండని జలగం అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 30న జరిగే ఎన్నికల్లో ఆయన ఎన్నికల గుర్తయిన సింహం గర్జిస్తుందా, లేదా అనేది ఆసక్తికరంగా మారింది.

జలగం కుటుంబంలో ఎత్తుపల్లాలు..

గతంలోనూ ప్రధాన పార్టీలను విబేధించి రాజకీయాలు చేసిన చరిత్ర జలగం కుటుంబానికి ఉంది. 1952లో జరిగిన ఎన్నికల్లో జలగం వెంగళరావుకు అప్పటి కాంగ్రెస్ నాయకత్వం వేంసూరు నుంచి టికెట్ నిరాకరించింది. దీంతో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో పార్టీ ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. ఆ తర్వాత కాలంలో తిరిగి పార్టీలో చేరి కేంద్రమంత్రి, ముఖ్యమంత్రి వంటి ఉన్నత పదవులు పొందారు. జలగం ప్రసాదరావు 1999లో ఖమ్మం నుంచి కాంగ్రెస్ తరఫున ఎంపీ టికెట్ ఆశించి భంగపడ్డారు. పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారంటూ ఆయనపై పార్టీ అధిష్టానం వేటు వేసింది. ఆ తర్వాత కాలంలో కాంగ్రెస్ వైపు ఆయన చూసింది లేదు. తాజాగా వెంకటరావు రాజకీయ ప్రయాణంలోనూ ఇదే తరహా ఎత్తు పల్లాలు ఎదురవుతున్నాయి.

రేపు కొత్తగూడేనికి పవన్ కళ్యాణ్

చుంచుపల్లి: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ గురువారం కొత్తగూడెం రానున్నారు. ప్రకాశం స్టేడియంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే సభలో ఆయన మాట్లాడుతారని, ఉమ్మడి జిల్లాలో బరిలో నిలిచిన బీజేపీ, జనసేన అభ్యర్థులు హాజరవుతారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రంగా కిరణ్, కొత్తగూడెం నియోజకవర్గ జనసేన అభ్యర్థి లక్కినేని సురేందర్‌రావు తెలిపారు.

టీడీపీ నేత బైండోవర్

పినపాక: మండలంలో అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తున్న వ్యక్తిని ఈ–బయ్యారం పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని జానంపేటలో సోమవారం రాత్రి అనుమతి తీసుకోకుండా పినపాక కాంగ్రెస్ అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు గెలుపును కాంచిస్తూ టీడీపీ అధికార ప్రతినిధి మేదరమెట్ల శ్రీనివాసరావు భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో శ్రీనివాసరావును బైండోవర్ చేశామని సీఐ శివప్రసాద్ వెల్లడించారు.

విద్యాసంస్థలో ప్రచారంపై కేసు

ఇల్లెందు: రెండు రోజుల కిందట పట్టణంలోని 24 ఏరియాలో గల ఓ ప్రభుత్వ విద్యాసంస్థలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ప్రత్యక్షంగా చూసిన ప్రత్య ర్థులు, పాఠశాల హెచ్‌ఎం ఫిర్యాదు మేరకు ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశామని ఎన్నికల అధికారి జె.కాశయ్య మంగళవారం తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, కార్యాలయాల్లో ఎన్నికల ప్రచారం చేయొద్దని ఆయన చెప్పారు.

పాలేరు అభ్యర్థులపై ఆర్‌ఓ సీరియస్!

లెక్కలు చూపని 11 మందికి నోటీసులు జారీ

నేలకొండపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పాలేరు స్థానం పోటీలో ఉన్న అభ్యర్థులు ఎన్నికల వ్యయ పుస్తకాలను అధికారులకు సమర్పించకపోవడంతో వారికి నోటీసులు జారీ చేశారు. మొదటి, రెండో విడతగా ఈనెల 14, 17న రికార్డులు సమర్పించాల్సి ఉంటుంది. అయితే, 11 మంది అభ్యర్థులు వివరాలను అందజేయకపోవడంతో పాలేరు రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి నోటీసులు జారీ చేశారు. ఈనెల 17న సమర్పించాల్సిన వివరాలను 20వ తేదీలోగా అందించాలని, లేనిపక్షంలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతేకాకుండా అభ్యర్థుల వాహనాల అనుమతులు రద్దు చేస్తామని తెలిపారు. కాగా, నోటీసులు అందుకున్న వారిలో అభ్యర్థులు దూలం వెంటకనారాయణ(ప్రజావాణి పార్టీ), కంపాటి వెంకటేశ్వర్లు(మార్క్సిస్ట్ కమ్యూనిస్టు ఆఫ్ ఇండియా(యునైటెడ్)), హలవత్ రామారావు(పిరమిడ్ పార్టీ ఇండియా)తోపాటు స్వతంత్ర అభ్యర్థులైన గడ్డం వీరబాబు, గోపోజు రమేశ్, తెలగమళ్ల రాంబాబు, రవీందర్ ఇస్లావత్, రాజేందర్ ఇస్లావత్, రామస హాయం మాధవీరెడ్డి, వాంకుడోత్ తిరుపతినాయక్, సురేష్ గుగులోత్ ఉన్నారు.



ఈ 'వేడి' తగ్గనివ్వొద్దు

రాష్ట్ర మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం నగరంలోని పలు డివిజన్లలో ఇంటింటి ప్రచారం చేశారు. అలాగే, ప్రధాన రహదారులపై వ్యాపారసంస్థలు, వీధి వ్యాపారుల వద్దకు వెళ్లి తనను మరోమారు గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా షాపుల్లో టీ కాయడమే కాక పాన్లు కట్టిన ఆయన పండ్లు కూడా విక్రయించారు. - ఖమ్మం మయూరిసెంటర్



ఔర్ ఏక్‌బార్.. తీన్‌మార్

పాలేరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి కందాళ ఉపేందర్‌రెడ్డి తిరుమలాయపాలెం మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన ప్రచార సభల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మరోమారు తనను గెలిపించాలని ఆయన కోరారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులు కందాళకు ఘనస్వాగతం పలికారు. అలాగే, పలుచోట్ల కార్యకర్తలు నృత్యం చేయగా ఎమ్మెల్యే సైతం వారితో పాదం కలిపారు. - తిరుమలాయపాలెం



మన 'గుర్తు' మరిచిపోవద్దు

ఇల్లెందు బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే బానోతు హరిప్రియ నియోజకవర్గ కేంద్రంతో పాటు పలు మండలాల్లో నాయకులతో కలిసి మంగళవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇప్పటికే అభ్యర్థులు ఖరారు కావడం, ఈవీఎంల్లో ఎవరి పేరు ఎక్కడ ఉంటుందో తెలిసిపోవడంతో డమ్మీ ఈవీఎంలను ఆమె ప్రదర్శించారు. ఈవీఎంపై కారు గుర్తును చూపిస్తూ ఓటు వేయాలని కోరారు. - ఇల్లెందు

రాముడినే మోసం చేసిన ఘనుడు కేసీఆర్

- సాధించుకున్న తెలంగాణ ఫలితాలు ఒక కుటుంబానికే..
- దొరల పాలనకు అంతం పలకాలి
- టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పాల్వంచ రోడ్ షోలో మాట్లాడుతున్న పొంగులేటి శ్రీనివాస రెడ్డి, పక్కన కూనంనేని తదితరులు



భద్రాచలంలో అభివాదం చేస్తున్న పొంగులేటి, తుమ్మల, బాలసాని, పొదెం వీరయ్య

భద్రాచలం/చర్ల/దుమ్ముగూడెం/బూర్గంపాడు/పాల్వంచ/కొత్తగూడెంరూరల్/సుజాతనగర్ : భద్రాద్రి రామయ్యను మోసం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ కో చైర్మన్ పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం, బూర్గంపాడు, పాల్వంచ, కొత్తగూడెంలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిన కేసీఆర్ చెంప చెల్లుమనేలా ప్రజలు తీర్పు ఇవ్వాలని కోరారు. రాముడిని దర్శించుకోవడం ఇష్టం లేని కేటీఆర్ కాకమ్మ కబుర్లు చెప్పి వెళ్లిపోయాడని అన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఫలాలన్నీ ఒక కుటుంబమే అనుభవిస్తోందని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం 1300 మంది ప్రాణత్యాగం చేసినా.. యువత ఆశయం నెరవేరలేదన్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 76 నుంచి 78 సీట్లు సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని, ఆ తర్వాత రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. కుటుంబంలో ఇద్దరు వృద్ధులకు రూ.8వేల చొప్పున పింఛన్ అందిస్తామని, ఆరు గ్యారెంటీలను కచ్చితంగా అమలు చేస్తామని చెప్పారు. రైతులతో పాటు కౌలు రైతులకు కూడా ఏటా రూ.15 వేలు, ప్రతి కూలీ కుటుంబానికి రూ.12వేలు ఇస్తామన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్యను పార్టీ మారాలంటూ బీఆర్ఎస్ వారు ఎన్ని ఆఫర్లు ప్రకటించినా.. సిద్ధాంతానికి కట్టుబడి, కాంగ్రెస్‌ను నమ్మి ఓట్లేసిన ప్రజల కోసం పార్టీ మారకుండా ఉన్నారని, అలాంటి వ్యక్తిని మరోసారి గెలిపించాలని పిలుపునిచ్చారు. మరో వారం రోజులు కష్టపడితే కాంగ్రెస్‌దే విజయమని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. డబ్బు సంచులతో వచ్చేవారికి బుద్ధి చెప్పాలని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా సమన్వయంతో పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని, రాష్ట్రంలో దోపిడీ పాలనను తరిమికొట్టి ఇందిరమ్మ రాజ్యం తేవాలని కోరారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలిపి కార్పొరేషన్ చేసే అవకాశం ఉందన్నారు. పినపాకలో పాయం వెంకటేశ్వర్లు, కొత్తగూడెంలో సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు విజయానికి కాంగ్రెస్, మిత్రపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. సాంబశివరావు నాలుగు దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్న నిస్వార్థ నాయకుడని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం సీఎం కేసీఆర్ ఒక్కో నియోజకవర్గానికి రూ.100 కోట్లు పంపించారని, అదంతా ప్రజాధనమేనని, వారు ఇచ్చే డబ్బు తీసుకుని కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు ఓటేయాలని పిలుపునిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి, ఖమ్మం అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా అభివృద్ధి కోసం గతంలో తాను అనేక పనులు చేశానని, ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మరింతగా అభివృద్ధి చేసే అవకాశం దక్కుతుందని అన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం అభ్యర్థి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించేందుకే తాము కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నామని చెప్పారు.

పినపాక అభ్యర్థి పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నియోజకవర్గం తన హయాంలోనే అభివృద్ధి జరిగిందని, ఈ ఎన్నికల్లో గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు బాలసాని లక్ష్మీనారాయణ, సాబీర్‌పాషా, నాగ సీతారాములు, యర్రంశెట్టి ముత్తయ్య, జాలే జానకీ రెడ్డి, శంకర్‌నాయక్, నూకల రంగారావు, పాకాలపాటి వెంకటేశ్వరరావు, బొల్లోజు అయోధ్య, తుక్లారి బ్రహ్మయ్య, బుడగం శ్రీనివాస్, చింతిరాల రవికుమార్, సరెళ్ల నరేష్, భోగాల శ్రీనివాస్ రెడ్డి, కొడాలి శ్రీనివాస్, ఎస్.కె అజీమ్, రాజారాం, కంభంపాటి సురేష్ కుమార్, రావులపల్లి రవికుమార్, కల్లూరి వెంకటేశ్వర్లు, నల్ల పు దుర్గాప్రసాదరావు, విజయ భాస్కర్‌రెడ్డి, ఇర్పా శాంత, చీమలమర్రి మురళీకృష్ణ, వీరభద్రం, తూము చౌదరి, శంకర్‌నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగ్ తెలంగాణ

నేడు ధన ప్రభావమే అధికం

- నాడు ఎన్నికల్లో పోటీకి ఖర్చు రూ.80 వేలే..
- ఇప్పుడు రూ.కోట్లు ఉంటేనే అధికారం
- మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర

బూర్గంపాడు: గతంలో ఎన్నికలంటే అభివృద్ధి దిశగా అడుగులు వేసే ప్రజాప్రతినిధి, లేదా వారు నివసించే గ్రామాల్లో పటేల్, ఊరిపెద్ద నిర్ణయించిన వారికి ఓటు వేసేవారని, ప్రస్తుత పరిస్థితుల్లో ధన ప్రభావంతో ఓటర్లు ప్రలోభాలకు గురవుతున్నారని బూర్గంపాడు మాజీ ఎమ్మెల్యే, ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ చందా లింగయ్య దొర అన్నారు. డబ్బు తీసుకుని ఓటు వేస్తున్నందున ప్రజాప్రతినిధులు అన్యాయాలకు పాల్పడినా, పనులు చేయకపోయినా ప్రశ్నించలేకపోతున్నామని చెప్పారు. తద్వారా అభివృద్ధికి నోచుకోక గ్రామాల పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారిందని అభిప్రాయపడ్డారు. నాడు, నేడు ఎన్నికల పరిస్థితిపై 'సాక్షి'తో మనోభావాలు పంచుకున్నారు. అవి ఆయన మాటల్లోనే...

- గతంలో ఏ అభ్యర్థి అయితే అభివృద్ధి చేస్తాడనేది ఊరి పెద్ద గమనించి.. ఆయన చెప్పిన వారికే ప్రజలు ఓటు వేసేవారు. నాడు ఓటర్లకు డబ్బు పంపిణీ అనే మాటే లేదు. 1985లో నేను బూర్గంపాడు నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యాను. అప్పుడు రూ.80వేలు మాత్రమే ఖర్చు చేశాను. 1996 నుంచి ధన ప్రభావం ఓటర్లపై పడడం ప్రారంభమై ఇప్పుడు మరింత అధికమైంది. ఇప్పుడు ఎమ్మెల్యేగా గెలవాలంటే ఒక్కొక్కరు రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు ఖర్చు పెడుతున్నారు. పార్లమెంట్ ఎన్నికలైతే రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు కూడా ఖర్చు చేస్తున్నారు. ఆ డబ్బును తిరిగి రాబట్టుకునేందుకు అక్రమాలకు పాల్పడుతూ అభివృద్ధిని గాలికొదిలేస్తున్నారు.

నేను బూర్గంపాడు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంది. ఆ సమయంలో ఖమ్మం జిల్లా నిర్లక్ష్యానికి గురై అభివృద్ధి జరగలేదు. 1985లో మణుగూరు మండల కేంద్రానికి ఒక బస్సు మాత్రమే ఉండేది. నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీఆర్‌ను అడిగితే ఏజెన్సీ ఏరియాల అభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇవ్వలేమని చెప్పారు. దీంతో ప్రధానమంత్రి రాజీవ్‌గాంధీని కలిసి కంపాక్ట్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిధులు కావాలని కోరాను. రోడ్లు, నీరు, విద్యుత్, నివాసాలు, పాఠశాలలు, విద్య, ఇరిగేషన్ వంటి పనులకు నివేదిక ఇవ్వడంతో కేంద్రం నుంచి వచ్చిన కమిటీ పరిశీలించి రూ.40 కోట్లు ఐటీడీఏ ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేసింది.



చందా లింగయ్యదొర

- అప్పటి రాజకీయాల్లో నైతికత, ప్రజాసంక్షేమం, అభివృద్ధిపై ధ్యాసే తప్ప.. అవినీతి, అక్రమాలకు తావు లేదు. ప్రశ్నిస్తే సమస్య పరిష్కారమయ్యేదే కానీ గొంతు నులిమే వారు కాదు. ఇప్పుడు రాజకీయాలు పూర్తిగా కక్షపూరితంగా మారాయి. ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉన్న ప్రాంతాలకు నిధులే ఇవ్వడం లేదు. దీంతో రాజకీయం రంగులు మారుతోంది.
- చట్టం, రాజ్యాంగంపై గౌరవం, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్నవారు మాత్రమే ఆయా ప్రాంతాలకు న్యాయం చేయగలరు. ఎన్నికలప్పుడు ఇచ్చే, వచ్చే ప్రలోభాలకు లొంగితే భవిష్యత్ అంధకారమే. అక్రమాలు, అవినీతి, అరాచకాలు మాత్రమే మిగులుతాయి. అభివృద్ధి చేయాలనే తపన ఉంటే ఏ పార్టీలో ఉన్నా సాధ్యమే.

క్లుప్తంగా

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం



పూజారికి చెక్కు అందిస్తున్న పూర్ణచందర్‌రావు

నవభారత్: కొత్తగూడెంలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి దివంగత కోనేరు నాగేశ్వరరావు కుమారుడు పూర్ణచందర్‌రావు దంపతులు విరాళం అందజేశారు. ఆలయానికి ప్రహరీ నిర్మాణంతో పాటు అన్నదానానికి గాను వారు మంగళవారం రూ.1,00,116 చెక్కును పూజారి రమణకు అందజేశాక ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బెల్ట్‌షాపు యజమానులపై కేసు

పాల్వంచ: కిరాణా షాపులో మద్యం అమ్ముతున్న ఇద్దరిపై కేసులు నమోదయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. ఎస్ఐ రాఘవయ్య ఆధ్వర్యంలో మంగళవారం బెల్ట్ షాపులు నడిపిస్తున్న కిరాణా షాపులపై దాడి చేశారు. మంచికంటినగర్‌లో చావల శ్రీనివాసరావు కిరాణా షాపులో రూ.9,500 విలువ చేసే ఎనిమిదిన్నర లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గుర్రం మహేశ్ షాపులో రూ.4,500 విలువ చేసే నాలుగున్నర లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేశారు.

హిజ్రా దారుణహత్య



చిన్నవెంకట్ (ఫైల్)

మధిర: మధిర పట్టణంలోని శివాలయం రోడ్డులో సోమవారం రాత్రి ఒక హిజ్రా హత్యకు గురయ్యాడు. వైరా మండలం ముసలిమడుగు గ్రామానికి చెందిన చిన్న వెంకట్ (45) అలియాస్ చిన్నారి శివాలయం రోడ్డులోని అద్దె ఇంట్లో నివసిస్తున్నాడు. తన మేనల్లుడితో ఇటీవల తరచూ గొడవలు జరుగుతున్నాయని సమాచారం. కాగా, చిన్న వెంకట్‌పై బలమైన ఆయుధంతో దాడిచేసి హత్య చేసినట్లు తెలుస్తోంది. ఈ హత్యకు కారణాలు, బాధ్యులెవరనేది తేలాల్సి ఉంది. అయితే, వెంకట్‌కు గతంలో వివాహం కాగా భార్యతో పాటు ఇద్దరు పిల్ల లు ఉన్నారు. మధిర సీఐ జాటోత్ వసంత్‌కుమార్ ఆధ్వర్యాన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సండ్ర, భట్టి కార్లు తనిఖీ



సండ్ర కారులో తనిఖీ చేస్తున్న ఉద్యోగులు



సీఎల్పీ నేత వాహనంలో తనిఖీ చేస్తున్న అధికారులు

సత్తుపల్లి: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కారును మండలంలోని మేడిశెట్టివారిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. కారుతో పాటు అందులో ఉన్న నిశితంగా పరిశీలించి అనుమానంగా ఏమీ లేవని నిర్ధారించాక ముందుకు పంపించారు. తనిఖీల్లో ఐబీ డీఈఈ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రావణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

భట్టి వాహనం..

నేలకొండపల్లి: సీఎల్పీ నేత, మధిర కాంగ్రెస్ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క వాహనాలను నేలకొండపల్లి మండల కేంద్రంలో అధికారులు తనిఖీ చేశారు. హైదరాబాద్ నుంచి మంగళవారం బయలుదేరిన ఆయన ముదిగొండ మండలంలో ప్రచారానికి వెళ్తున్నారు. ఈక్రమంలో నేలకొండపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలను ఆపి తనిఖీ చేశారు.

డబ్బులు దొరక్కపోతే మీ ఓటు వేయండి

కొణిజర్ల: కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి వాహనాన్ని ఖమ్మం జిల్లా కొణిజర్లలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద అధికారులు మంగళవారం రాత్రి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారికి, రేణుక మధ్య ఆసక్తికర సంభాషణ జరిగింది. కారులో డబ్బు దొరక్కపోతే తమకు ఏమిస్తారని రేణుకాచౌదరి అడగ్గా.. తామేమీ ఇవ్వగలమని అధికారి చైతన్య బదులిచ్చారు. అయితే, ఓటు కాంగ్రెస్ అభ్యర్థికి వేయాలని రేణుకాచౌదరి సూచించారు.



రేణుకాచౌదరి కారులో తనిఖీ చేస్తున్న అధికారి

నగదు, మద్యం సీజ్

రూ.2.8లక్షల నగదు

ఖమ్మంక్రైం: సరైన పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.2.80 లక్షల నగదును ఖమ్మం త్రీటౌన్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో ఈఒ వ్యక్తి వద్ద ఈ నగదు లభ్యమైందని, సరైన ఆధారాలు లేకపోవడంతో సీజ్ చేశామని సీఐ సత్యనారాయణ తెలిపారు.

భద్రాచలంలో..

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ఒక వ్యక్తి నుంచి రూ.96 వేలు, మరో వ్యక్తి నుంచి రూ.54 వేలను గుర్తించి స్వాధీనం చేస్తున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపించకపోవడంతో నగదును సీజ్ చేశామని సీఐ నాగరాజురెడ్డి మంగళవారం తెలిపారు.

మోరంపల్లిబంజరలో...

బూర్గంపాడు: మోరంపల్లిబంజరలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద మంగళవారం పోలీసుల తనిఖీల్లో ఆరు మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. ఓ కారును తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న మద్యం బాటిళ్లను సీజ్‌చేసి, కేసు నమోదు చేశారు.



దమ్మపేట: కారులో తనిఖీ చేస్తున్న అధికారులు

మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద...

దమ్మపేట: ఎన్నికల నిబంధనల మేరకు చేస్తున్న తనిఖీల్లో, ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదు, మద్యం సీసాలను ఎఫ్ఎస్ టీం ఆధ్వర్యంలో పోలీసులు సీజ్ చేశారు. మంగళవారం మండలంలోని మందలపల్లి చెక్‌పోస్ట్ వద్ద చేస్తున్న తనిఖీల్లో రెండు వేర్వేరు కార్లలో కలిపి మొత్తంగా రూ.1,69,500 నగదును గుర్తించారు. ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేశారు. దమ్మపేట గ్రామంలోని అర్బన్ కాలనీ, లచ్చాపురం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 132 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని ఎఫ్ఎస్ టీం అధికారి కృష్ణ తెలిపారు.

పెట్టారు.. తీసేశారు!

మధిరలో మంగళవారం ప్రజాఆశీర్వాద సభా వేదికపై భారీ బ్యానర్ ఏర్పాటుచేశారు. ఇందులో సీఎం కేసీఆర్ సహా రాష్ట్ర మంత్రి, ఖమ్మం బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు, అభ్యర్థి కమల్‌రాజ్ తదితరుల ఫొటోలు ముద్రించారు. అయితే, పువ్వాడ ఖమ్మం అభ్యర్థి కావడం, ఆయన ఫొటో బ్యానర్‌పై ఉంటే సభ ఖర్చు ఆయన ఖాతాలోనూ జమ అవుతుందని చర్చ జరిగింది. దీంతో సభ ప్రారంభానికి ముందే పువ్వాడ ఫొటోను బ్యానర్‌పై కత్తిరించారు. - స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సభ ప్రారంభమయ్యాక...

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



ఫ్లెమింగ్ (ఫైల్)

అశ్వారావుపేట: హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదువుతున్న మండలంలోని నందిపాడు గ్రామానికి చెందిన విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పద్దం శ్రీను కుమారుడు ఫ్లెమింగ్ (16) హైదరాబాద్ దుర్గంచెరువు పరిధిలోని ఓ కార్పొరేట్ కళాశాలలో బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఫ్లెమింగ్ ఆత్మహత్యకు పాల్పడినట్లు తండ్రి శ్రీనుకు పోలీసులు సమాచారం అందించారు. కాగా, మృతుడి తల్లి నాగమణి కరోనా సమయంలో మృతిచెందారు. ఫ్లెమింగ్ మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

గాయపడిన యువకుడు మృతి

ములకలపల్లి: ద్విచక్రవాహన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. సత్తుపల్లి మండలంలోని రేగళ్లపాడు గ్రామానికి చెందిన పట్లె నాగబాబు ద్విచక్ర వాహనంపై ములకలపల్లిలోని బంధువుల ఇంటికి వచ్చాడు. తిరుగు ప్రయాణంలో సోమవారం రాత్రి స్థానిక ఎస్‌బీఐ ఎదుట నాగబాబు బైక్‌తోసహా కిందపడ్డాడు. నాగబాబు తలకు తీవ్రగాయాలు కాగా పాల్వంచ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ పుల్లారావు తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్...



రామారావు (ఫైల్)

పాల్వంచ: విధి నిర్వహణలో ఉన్న సమయంలో హెడ్ కానిస్టేబుల్‌కు గుండెపోటు రావడంతో మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. సోమవారం కేటీపీఎస్ 7వ దశ ప్రధాన గేటు వద్ద ఎస్‌పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ రావుల రామారావు (48) సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్నారు. కాగా, ఒక్కసారిగా గుండెపోటు వచ్చి కింద పడిపోయారు. వెంటనే తోటి కానిస్టేబుళ్లు కేటీపీఎస్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. మృతదేహాన్ని సత్తుపల్లి మండలం గూడురుకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని అడిషనల్ కమాండెంట్ సి.జంగయ్య, అసిస్టెంట్ కమాండెంట్ అప్పాజీ, సిబ్బంది సందర్శించి నివాళులర్పించారు.

ఆభరణాలు, నగదు చోరీ




ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

సత్తుపల్లి: పట్టణంలోని విద్యానగర్ రోడ్డులోని నివాసముంటున్న రతికంటి ప్రభాకరరావు నివాసంలో చోరీ జరిగింది. సత్తుపల్లి సీఐ మోహన్‌బాబు కథనం ప్రకారం..ప్రభాకరరావు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి పంచారామాల యాత్రకు వెళ్లి మంగళవారం తెల్లవారుజామున వచ్చాడు. అప్పటికే ఇంటి తాళంతో పాటు లోపల కప్‌బోర్డు, బీరువాలు పగలగొట్టి ఉండగా.. 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 1,500 గ్రాముల వెండి ఆభరణాలు, రూ.1.50లక్షల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఆయన ఫిర్యాదు మేరకు ఖమ్మం నుంచి క్లూస్‌టీంను రప్పించి దర్యాప్తు ప్రారంభించినట్లు సీఐ తెలిపారు.

హైకోర్టు తీర్పును రద్దు చేయండి

చంద్రబాబుకు బెయిల్ విషయంలో పరిధి దాటింది ● రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఎస్సెల్పీ దాఖలు

- సుప్రీంకోర్టు నిర్దేశించిన కొలమానాలను హైకోర్టు అతిక్రమించింది
- కేసు లోతుల్లోకి వెళ్లి క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం చేసింది
- ట్రయల్ కోర్టును ప్రభావితం చేసేలా ఆ తీర్పు ఉంది
- మినీ ట్రయల్ నిర్వహణ.. 39 పేజీల తీర్పే ఇందుకు నిదర్శనం
- దుర్వినియోగం చేసిన నిధులు టీడీపీ ఖాతాల్లోకి వెళ్లాయి
- అందుకు పూర్తి ఆధారాలున్నా ఏమాత్రం పట్టించుకోలేదు
- చంద్రబాబుకు రాజకీయ పలుకుబడి ఉంది.. సాక్షులను బెదిరించడం ద్వారా దర్యాప్తును ప్రభావితం చేస్తారు
- హైకోర్టు తేల్చిన అంశాలు వాస్తవ విరుద్ధం



సాక్షి, అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో నిందితుడైన మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు పూర్తి స్థాయి బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు తీర్పును రద్దు చేయాలని కోరుతూ మంగళవారం స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసింది. ఇందులో నారా చంద్రబాబునాయుడిని ప్రతివాదిగా చేర్చింది. ఈ ఎస్ఎల్పీ తేలేంత వరకు హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరింది. హైకోర్టు స్కిల్ కుంభకోణంలో సీఐడీ చేసిన ఆరోపణల పూర్వాపరాల్లోకి వెళ్లి చంద్రబాబుకు క్లీన్‌చిట్ ఇచ్చిందని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చింది. ఒకవైపు కేసు లోతుల్లోకి వెళ్లడం లేదని చెబుతూ, మరో వైపు సీఐడీ ఆరోపణలు, అందుకు సమర్పించిన ఆధారాలు, ఇతర అంశాల పూర్వాపరాల్లోకి వెళ్లి హైకోర్టు తీర్పు వెలువరించిందని వివరించింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా కేసు లోతుల్లోకి వెళ్లకూడదన్న సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా హైకోర్టు వ్యవహరించిందని స్పష్టం చేసింది. హైకోర్టు చంద్రబాబు బెయిల్ పిటిషన్‌ను డిశ్చార్జ్ పిటిషన్‌ను విచారించినట్లు విచారించిందని రాష్ట్ర ప్రభుత్వం ఆక్షేపించింది. 'హైకోర్టు స్కిల్ కుంభకోణం కేసు లోతుల్లోకి వెళ్లి మరీ చంద్రబాబుకు బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా పలు వ్యాఖ్యలు చేసింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు తేల్చిన పలు అంశాలు వాస్తవ విరుద్ధం. ట్రయల్ సందర్భంగా కింది కోర్టును ప్రభావితం చేసేలా హైకోర్టు తీర్పు ఉంది. బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు ఏకంగా 39 పేజీల తీర్పు వెలువరించింది. బెయిల్ మంజూరు సందర్భంగా హైకోర్టు మినీ ట్రయల్ నిర్వహించింది. రికార్డుల్లో ఉన్న అంశాలకు విరుద్ధంగా హైకోర్టు తన నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కేసులో హైకోర్టు తన పరిధిని అతిక్రమించింది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో పేర్కొంది.

సుప్రీంకోర్టు నిర్దేశించిన పరిధుల అతిక్రమణ

'ప్రాథమిక ఆధారాలను బట్టి చూస్తే హైకోర్టు తీర్పు చెల్లుబాటు కాదు. దానిని రద్దు చేయాలి. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఎలా వ్యవహరించాలన్న దానిపై ఇప్పటికే స్పష్టంగా తేల్చిన న్యాయపరమైన కొలమాలన్నింటినీ హైకోర్టు తన తీర్పు ద్వారా అతిక్రమించింది. బెయిల్ పిటిషన్ల విచారణ సందర్భంగా సాక్ష్యాలను పూర్తి స్థాయిలో పరిశీలించడం, కేసు లోతుల్లోకి వెళ్లడాన్ని సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో తీవ్రంగా తప్పుపట్టింది. మినీ ట్రయల్ కూడా నిర్వహించకూడదని చెప్పింది. అయితే హైకోర్టు ఏకంగా ట్రయల్ నిర్వహించింది. బెయిల్ మంజూరు సందర్భంగా సీఐడీ ఆరోపణలను, వారి తీవ్రతను, డాక్యుమెంట్ల విశ్వసనీయతను, సాక్ష్యాల విలువను హైకోర్టు తన తీర్పులో తేల్చేసింది. హైకోర్టు బెయిల్ మంజూరు సమయంలో అనుసరించాల్సిన ప్రాథమిక కొలమానాలన్నింటికి విరుద్ధంగా వ్యవహరించింది. చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్రాసిక్యూషన్ నమోదు చేసిన కేసు ప్రభావితం అయ్యేలా హైకోర్టు వ్యవహరించింది. దుర్వినియోగం చేసిన నిధులు తెలుగుదేశం పార్టీ ఖాతాలకు మళ్లించారని తేల్చేందుకు నిర్దిష్ట ఆధారాలు లేవని హైకోర్టు తేల్చింది. బెయిల్ పిటిషన్ విచారణ సందర్భంగా ఈ అంశాల జోలికి వెళ్లరాదు. హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న బెయిల్ పిటిషన్‌ను అడ్డంపెట్టుకుని తెలుగుదేశం పార్టీ వర్గాలు సీఐడీ దర్యాప్తునకు అడ్డుగోడలా నిలబడ్డాయి. సీఐడీ సమన్లకు ఏమాత్రం సహకరించలేదు. సీఐడీ సమన్లకు టీడీపీ వర్గాలు స్పందించలేదన్న వాస్తవాన్ని హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. మనీలాండరింగ్ అంశంపై ఈడీ దర్యాప్తు చేస్తోంది. నిధులు ఎక్కడకు వెళ్లాయన్న దానిపై నిర్దిష్ట ఆధారాలున్నాయి. వాటిని హైకోర్టు ముందు ఉంచడం జరిగింది. అన్ని అంశాలపై ఏపీ సీఐడీ, ఈడీ దర్యాప్తు చేస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారంలో నిధుల మళ్లింపు జరగలేదని తేల్చడం ద్వారా హైకోర్టు ఘోర తప్పిదానికి పాల్పడింది. స్కిల్ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్ కంపెనీ అంతర్గతంగా నిర్వహించిన విచారణను, దాని తాలూకు నివేదికను హైకోర్టు ఏమాత్రం పరిగణనలోకి తీసుకోలేదు. అసలు ఆ నివేదికలో ఏమీ లేదని తేల్చేసింది' అని వివరించింది.

స్పష్టంగా నగదు జాడలు

'ప్రాజెక్టు విలువ రూ.36 కోట్లు అని చంద్రబాబు తదితరులు చెబుతున్నారు. అలా అయితే గత ప్రభుత్వం రూ.370 కోట్లు ఎందుకు విడుదల చేసినట్లు? మిగిలిన రూ.280 కోట్లు దారి మళ్లినట్లే. ఎంవోయూ, జీవో ప్రకారం అందచేయాల్సిన సాంకేతికతను సీమెన్స్, డిజైన్ టెక్‌లు అందించలేదన్నది వాస్తవం. అయితే సీఐడీ ఈ అంశాన్ని లేవనెత్తలేదని హైకోర్టు తన తీర్పులో చెప్పింది. వాస్తవానికి రిమాండ్‌లోనూ, హైకోర్టు వాదనల్లోనూ ఈ అంశాన్ని లేవనెత్తాం. ఫోరెన్సిక్ ఆడిట్‌ను ప్రతికూల కోణంలో చూడటం ద్వారా హైకోర్టు తన పరిధి దాటి వ్యవహరించినట్లయింది. స్కిల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు మొత్తం విజయవంతమైందని, దీని ద్వారా 2.13 లక్షల మంది విద్యార్థులు శిక్షణ పొందినట్లు తేల్చింది. ఇలా చెప్పడం ద్వారా హైకోర్టు తప్పు చేసింది. హైకోర్టు చెప్పింది ఎంతమాత్రం వాస్తవం కాదు. అధికారులు లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చే అధికారం చంద్రబాబుకు ఉందని హైకోర్టు తేల్చింది. ఒకవేళ అలాంటిది ఉందని అనుకున్నా, చంద్రబాబు తన, షెల్ కంపెనీల స్వీయ లబ్ధి కోసం దురుద్దేశపూర్వకంగా ఆ అధికారాన్ని ఉపయోగించారు. ఈ విషయాన్ని హైకోర్టు తన తీర్పులో పూర్తిగా విస్మరించింది. ఈ కుంభకోణానికి సంబంధించి సీమెన్స్, డిజైన్‌టెక్ ఉద్యోగులు ఇచ్చిన వాంగ్మూలాలను హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదు. ఈ ప్రాజెక్టులో రాజకీయ జోక్యం ఉందని, ప్రాజెక్టు అమలుకు అడ్డువచ్చిన వారిని 24 గంటల్లో బదిలీ చేశారన్న వాంగ్మూలాలను పట్టించుకోలేద'ని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

క్లీన్‌చిట్ ఇచ్చే ప్రయత్నం!

'సీమెన్స్, డిజైన్‌టెక్ నుంచి రావాల్సిన 90 శాతం నిధులు రాలేదని, అందువల్ల ప్రభుత్వం చెల్లించాల్సిన 10 శాతం నిధులను చెల్లించడం సరికాదన్న అప్పటి ఆర్థిక శాఖ కార్యదర్శి అభ్యంతరాలను చంద్రబాబు పట్టించుకోని విషయాన్ని హైకోర్టు పూర్తిగా విస్మరించింది. అవినీతి నిరోధక చట్టం మౌలిక సూత్రాల నుంచి, పబ్లిక్ సర్వెంట్ అధికారం దుర్వినియోగం వంటి వాటి నుంచి హైకోర్టు దూరంగా వెళ్లింది. చంద్రబాబు సాక్షులను ప్రభావితం చేసే విషయంపై హైకోర్టు వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఎంతమాత్రం హేతుబద్ధమైనవి కావు. తన పీఏ పెండ్యాల శ్రీనివాస్ విదేశాలకు పారిపోవడం, కీలక నిందితులు సీఐడీ ముందుకు రాకపోవడం వంటి వాటి విషయంలో చంద్రబాబు పాత్ర ఉన్న విషయాన్ని హైకోర్టు పట్టించుకోలేదు. చంద్రబాబు రాజకీయంగా చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి. దర్యాప్తును ప్రభావితం చేయడం, సాక్షులను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. దర్యాప్తుకు విఘాతం కలిగేలా కొందరు నిందితులు మీడియా స్టేట్‌మెంట్లు ఇస్తున్నారు. తెలుగుదేశం పార్టీ వర్గాలు దర్యాప్తునకు సహకరించడం లేదు. చంద్రబాబుకు బెయిల్ కోసం కాకుండా క్లీన్‌చిట్ ఇచ్చే అంశంగా పరిగణించి ఆదేశాలు ఇచ్చినట్లు ఉంది. వీటన్నింటిరీత్యా చంద్రబాబు జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది' అని రాష్ట్ర ప్రభుత్వం తన పిటిషన్‌లో వివరించింది.

క్వశ్చన్ ఆఫ్ లా..

హైకోర్టు తీర్పులో పలు అంశాలపై అనుమానాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వం పిటిషన్‌లో పేర్కొంది. 'క్వశ్చన్ ఆఫ్ లా'కి సంబంధించి పలు ప్రశ్నలను సుప్రీంకోర్టు ఎదుట ఉంచింది. హైకోర్టు కసరత్తులో న్యాయపరమైన విధానం లోపించిందా? దర్యాప్తులో సేకరించిన సాక్ష్యాధారాలు, నిందితుడి నేరానికి సంబంధించిన అంశాలపై హైకోర్టు వ్యాఖ్యలు న్యాయపరమైన అంశాలకు విరుద్ధంగా ఉన్నాయా? బెయిల్‌పై పిటిషనర్ల వాదనలు లేనప్పుడు హైకోర్టు విస్తృతమైన తీర్పు ఇవ్వగలదా? పీసీ చట్టం 1988 ప్రకారం అధికారిక నిర్ణయాల విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని నిర్దోషిగా భావించొచ్చా? అధికారం, అధికార వినియోగం, అధికారిక పరిధి లేకపోవడం, అధికార సామర్థ్యాన్ని దుర్వినియోగం చేయడం, ఇతరులకు సొమ్ము రూపంలో లబ్ధి చేకూర్చడం తదితరాలపై హైకోర్టు నిర్ణయం సరైనదేనా?' అనే ప్రశ్నలను సుప్రీంకోర్టు ముందుంచింది. నిరంజన్‌సింగ్ వర్సెస్ ప్రభాకర్ రాజారామ్, సుమిత్ శుభాచంద్ర గంగ్వాల్ వర్సెస్ మహారాష్ట్ర కేసుల్లో తీర్పులతోపాటు స్కిల్ స్కామ్ కేసులో సాక్ష్యాధారాలను వివరించే అంశాన్ని హైకోర్టు పదేపదే తిరస్కరించిందని పేర్కొంది. సంగీతబెన్ వర్సెస్ గుజరాత్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలు ప్రస్తావిస్తూ ప్రస్తుత కేసులో హైకోర్టు ఆయా అంశాలను పరిశీలించకుండా బెయిల్ కేసును మినీ ట్రయల్‌గా మార్చిందని, ట్రయల్ కోర్టు వనితీరును విస్మరించిందని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. ఈ ఒక్క కేసు పరిశీలనతోనే హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను పక్కన పెట్టవచ్చని నివేదించింది.

చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ

- ఫైబర్‌నెట్ కేసులో నిందితుల ఆస్తుల అటాచ్‌మెంట్
- ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు న్యాయస్థానం అనుమతి



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసులో చంద్రబాబు ముఠాకు ఎదురుదెబ్బ తగిలింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న చంద్రబాబు సన్నిహితుల ఆస్తుల అటాచ్‌మెంట్‌కు విజయవాడ ఏసీబీ న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీఐడీ దాఖలు చేసిన అటాచ్‌మెంట్ పిటిషన్‌ను ఆమోదిస్తూ న్యాయస్థానం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు సహా పలువురిపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో చంద్రబాబును ఏ–25గా, ఏ–1గా వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీ, ఏ–13గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ ఉన్నారు. కుంభకోణంలో నిందితుల పాత్రపై స్పష్టమైన ఆధారాలు లభించడంతో వారి ఆస్తులను అటాచ్ చేయాలని సీఐడీ నిర్ణయించింది. ఏపీ, తెలంగాణలో టెరాసాఫ్ట్ కంపెనీ, తుమ్మల గోపీచంద్ తదితరుల పేరిట ఉన్న రూ.114 కోట్ల విలువైన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనను హోం శాఖ ఆమోదించింది. దాంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ సీఐడీ న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఇందుకు న్యాయస్థానం అనుమతినివ్వడంతో ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ సిద్ధమవుతోంది.

చంద్రబాబు పన్నాగమే..

టీడీపీ ప్రభుత్వ హయాంలో నిబంధనలకు విరుద్ధంగా అప్పటి సీఎం చంద్రబాబు తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి ఫైబర్‌నెట్ టెండర్లను కట్టబెట్టారు. మొత్తం రూ.3,300 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో రాష్ట్ర ప్రభుత్వం దశలవారీగా ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. మొదటిదశ కింద రూ.330 కోట్ల ప్రాజెక్టును టెండర్లలో ఎల్–1గా వచ్చిన బిడ్డర్‌ను కాదని మరీ టెరాసాఫ్ట్‌కు కట్టబెట్టారు. అందుకోసం బ్లాక్ లిస్టులో ఉన్న టెరాసాఫ్ట్ కంపెనీని ఆ జాబితా నుంచి తొలగించి, టెండర్లలో పాల్గొనేందుకు అనుమతించారు. ఏపీ గవర్నింగ్ కౌన్సిల్‌లో సభ్యుడిగా ఉన్న వేమూరి హరికృష్ణను ఫైబర్‌నెట్ టెండర్ల మదింపు కమిటీలో సభ్యుడిగా నియమించారు. ఆయనకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీయే టెండర్లలో పాల్గొని, పనులు దక్కించుకుంది. ఇది పరస్పర ప్రయోజనాల నిరోధక చట్టానికి విరుద్ధం. టెరాసాఫ్ట్ కంపెనీ పనులు కూడా నాసిరకంగా చేసి, రూ.144.53 కోట్లను దారి మళ్లించినట్టు సీఐడీ దర్యాప్తులో వెల్లడైంది.

అటాచ్ చేయాలని నిర్ణయించిన ఆస్తులు

- ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వర రావు పేరిట గుంటూరులో ఉన్న 797 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఇంటి స్థలం
- కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్
- టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు ఫ్లాట్లు, ఆయన పేరిటే యూసుఫ్‌గూడలో ఉన్న మరో ఫ్లాట్
- తుమ్మల గోపీచంద్ భార్య పవన దేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి

ఇళ్లపైకి 'పచ్చ'దొంగలు.. జాగ్రత్త!

ఒకేసారి ఐదు కోట్ల మంది ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ కుట్ర.. లేని మేనిఫెస్టో పేరుతో ఇళ్లల్లోకి జొరబడుతున్న పచ్చ దొంగలు

- బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో బురిడీ
- వచ్చే ఐదేళ్లలో లక్షల్లో లబ్ధి అంటూ ప్రజలకు ప్రలోభాలు
- ఇది సైబర్ క్రైం కిందకు వస్తుంది.. ప్రజాప్రాతినిధ్య చట్టం ఉల్లంఘన కూడా..
- ఓటరు కార్డు తీసుకుని ఈసీ నిబంధనల ఉల్లంఘన, ప్రజల ప్రాథమిక హక్కులకూ భంగం
- మాయల పకీరు చేతిలో ప్రజల డేటా.. అందరూ అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల విజ్ఞప్తి



వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జిల్లా వార్తలు

వైకుంఠ ఏకాదశి ఉత్సవ ఏర్పాట్లపై పరిశీలన



గోదావరి ఒడ్డున పరిశీలిస్తున్న ఈఓ, అధికారులు

దుమ్ముగూడెం: భద్రాద్రి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాలలో జరగనున్న వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ఏర్పాట్లు మొదలయ్యాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రియాంక ఆదేశాల మేరకు భద్రాచలం దేవస్థానం ఈఓ రమాదేవి మంగళవారం పర్ణశాలలో పరిశీలించారు. గోదావరి తీరంలో నిర్వహించే తెప్పోత్సవం సాధ్యాసాధ్యాలపై దేవస్థాన వైదిక కమిటీతో పాటు వివిధ శాఖల అధికారులతో చర్చించారు. పర్ణశాల గోదావరి తీరం దగ్గర సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు సంబంధించి కాంక్రీట్ గోడ నిర్మాణ పనులు చేపట్టగా, ప్రస్తుతం నిలిపేశారు. అక్కడ తెప్పోత్సవం నిర్వహణకు అనువుగా ఉంటుందా, లేదా అనే అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లుఈఓ రమాదేవి తెలిపారు.

జాతీయ ఆర్చరీ మీట్‌లో కాంస్య పతకం



లక్ష్మణ్‌తో కోచ్ నగేశ్

ఖమ్మంస్పోర్ట్స్: రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌లో జరుగుతున్న 43వ జాతీయస్థాయి జూనియర్ ఆర్చరీ పోటీల్లో ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో శిక్షణ పొందుతున్న కె.లక్ష్మణ్ కాంస్య పతకం సాధించాడు. ఇండియన్ రౌండ్ 40 మీటర్లలో ఆయన తృతీయస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌ను ఆర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాధుల సారంగపాణి, పుట్టా శంకరయ్య, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం డీవైఎస్‌ఓలు టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఎం.పరంధామరెడ్డి, కోచ్ నగేశ్ అభినందించారు.

పత్తి రైతుల ఆశలు గల్లంతు

- వర్షాభావ పరిస్థితులతో గణనీయంగా తగ్గిన దిగుబడి
- ఎకరాకు ఐదు క్వింటాళ్లు మించని పంట
- ఆపై ఆశించిన ధర లేక నష్టాల బాటలో రైతులు



వర్షాభావంతో పూతాకాత దశలో వడబడిన పత్తి పైరు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది పత్తి పంట సాగు చేసిన రైతుల ఆశలు గల్లంతయ్యాయి. వర్షాభావ పరిస్థితులు దిగుబడిపై తీవ్ర ప్రభావాన్ని చూపగా.. కనీసం పెట్టుబడి దక్కే అవకాశం కనిపించడం లేదు. అరకొరగా పండిన పంటకు సైతం ఆశించిన ధర దక్క రైతులుమరింత కుమిలిపోతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగు చేసే ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. అయితే, గడిచిన మూడేళ్లుగా పత్తి సాగు రైతులకు ప్రయోజనం కలిగించడం లేదు. గత రెండేళ్లుగా అధిక వర్షాలు పంటను దెబ్బతీయగా ఈసారి వర్షాభావ పరిస్థితులు ఎదురయ్యాయి. గడిచిన రెండేళ్లు సమృద్ధిగా నీరు ఉండటంతో దెబ్బతిన్న పత్తిని తొలగించి మొక్కజొన్న సాగు చేసిన రైతులు కొంత మేర నష్టాల నుంచి గట్టెక్కారు. కానీ ఈసారి ఆ పరిస్థితులు కూడా కనిపించడం లేదు.

ప్రధాన పంటల్లో పత్తి ఒకటి

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. వరి తర్వాత పత్తి విస్తీర్ణం అధికంగా ఉంటుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతులు 4.50లక్షల ఎకరాల మేర పత్తి సాగు చేసే వారు. గత రెండేళ్ల ఫలితాలను బేరీజు వేసుకుని ఈ ఏడాది 3,85,598 ఎకరాల విస్తీర్ణంలోనే సాగు చేశారు. ఇందులో ఖమ్మం జిల్లాలో 1,85,225 ఎకరాల్లో సాగు చేయగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 2,00,373 ఎకరాల్లో సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఖమ్మం జిల్లాలో 1,38,918 మెట్రిక్ టన్నులు, భద్రాద్రి జిల్లాలో 1,46,072 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసినా.. ఆ లెక్కలు తప్పుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

దెబ్బతీసిన వర్షాభావం

ఈ ఏడాది వానాకాలం సీజన్ ఆరంభం నుంచి పత్తి సాగుకు ప్రతికూల పరిస్థితులే ఎదరయ్యాయి. జూన్ ఆరంభంలో తొలకరి వర్షాలపై ఆశతో రైతులు పొడి దుక్కుల్లో పత్తి విత్తనాలు వేయగా... ఆ నెల సాధారణ వర్షపాతం కూడా నమోదు కాలేదు. దీంతో విత్తనాలు మొలకెత్తకపోగా.. మరోసారి నాటడంతో జూలై వానలకుమొలకెత్తాయి. మళ్లీ ఆగస్టు నుంచి వర్షాభావ పరిస్థితులు ఎదురు కావడం పత్తిని దెబ్బతీసింది.

ఎకరాకు ఐదు క్వింటాళ్లే..

ప్రస్తుతం పత్తి ఎకరాకు ఐదు క్వింటళ్లకు మించి దిగుబడి రావటం లేదు. అది కూడా నల్ల రేగడి నేలల్లో తేమను కొంత నిలుపుకునే గుణం కలిగిన భూముల్లో వస్తుండగా, మిగతా చోట్ల 3 నుంచి 4 క్వింటాళ్లు దాటడం లేదు. నీటి వనరులు ఉంటే మాత్రం కొంత మేరకు ఆశాజనకంగా ఉందని రైతులు చెబుతున్నారు. సాధారణంగానైతే పది నుంచి 12క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అంచనా.

ధర కూడా దక్కక

వర్షాభావ పరిస్థితుల కారణంగా పత్తి దిగుబడి పడిపోగా, ఆశించిన ధర కూడా దక్కటం లేదు. ఎకరా పత్తి సాగుకు రూ.35వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెడతారు. దిగుబడి ఎకరాకు ఐదు క్వింటాళ్లు వస్తేప్రస్తుత ధర రూ.6 వేల ప్రకారం రూ.30 వేలకు మించి ఆదాయం రాదు. ఈ ఏడాది ప్రభుత్వం పత్తికి కల్పించిన ధర కూడా రైతులకు గిట్టుబాటు కావటం లేదు. కేంద్రప్రభుత్వం తేమ శాతం ఆధారంగా రూ.7,020 ధర నిర్ణయించింది. సీసీఐ ద్వారా కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసినా నిబంధనలు ప్రతిబంధకాలుగా మారాయి. దీనికి తోడు పంటతీత ఖర్చులు, రవాణా, కాంటా ఖర్చులు, కమీషన్లను కలిపితే రైతులకు రూ.25వేలకు మించి రాకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు.



వానలు లేక ఎండిపోతున్న పత్తి చేను

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పత్తి సాగు (ఎకరాల్లో)

జిల్లా	సాగు విస్తీర్ణం
ఖమ్మం	1,85,225
భద్రాద్రి కొత్తగూడెం	2,00,373

వానలు లేక దెబ్బతిన్న పత్తి



ఈ ఏడాది వానలు లేక పత్తి బాగా దెబ్బతిన్నది. మూడెకరాల సొంత భూమికి తోడు ఐదెకరాలకు కౌలుకు తీసుకుని సాగు చేశా. పూత, కాత దశలో వానలు లేక పూర్తిగా పోయింది. ఎకరాకు మూడు నుంచి నాలుగు క్వింటళ్లకు మించి దిగుబడి రాకపోవడంతో పూర్తిగా నష్టపోయినట్లే.

– తురక రాంబాబు, ఎద్దులచెరువు, తిరుమలాయపాలెం మండలం

నష్టాల ఊబిలోకి..



ఐదెకరాల్లో పత్తి సాగు చేశా. వర్షాలు లేక పంట దెబ్బతిన్నది. కౌలుతో కలుపుకొని ఎకరాకు రూ. 50 వేల వరకు పెట్టుబడులు పెట్టా. నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రావడం లేదు. మొదటితీత పత్తి క్వింటాకు రూ.6వేలు చెల్లించగా ఖర్చులు పోను రూ.5,500లే చేతికొచ్చాయి.

– జడ సంగమేశ్వరరావు, అమ్మపాలెం, కొణిజర్ల మండలం

దిగుబడి లేదు.., ధర లేదు



వర్షాలు లేకపోవటంతో దిగుబడి బాగా తగ్గింది. ఎకరాకు ఐదు క్వింటాళ్లకు మించి దిగుబడి లేదు. గత ఏడాది రూ.10 వేలకు పైగా పలికిన ధర ఈ ఏడాది రూ.6,500 దాటడం లేదు. ఓ వైపు దిగుబడి లేక, మరో వైపు ధర రాక పత్తి సాగుతో పూర్తిగా నష్టాలే ఎదురయ్యాయి.

– వేముల కోటేశ్వరరావు, చిరుమర్రి, ముదిగొండ మండలం

మలేషియాలో అయ్యప్ప మహా పడిపూజ



అప్పయ్య ఆలయం వద్ద పుల్లం రాజు, తదితరులు

ఖమ్మంఅర్బన్: మలేషియాలోని బాటుకేవ్స్‌లో ఉన్న అయ్యప్ప ఆలయంలో 18 ఏళ్లకోసారి నిర్వహించే కుంబాభిషేకం, మహా పడిపూజ ఉత్సవాలు ఇటీవల రెండు రోజుల పాటు జరిగాయి. ఈ పూజకు దేశం నలమూలల నుంచి 12 మంది ప్రతినిధులకు ఆహ్వానం అందగా, ఖమ్మంకు చెందిన అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర కార్యదర్శి టీ.వీ.పుల్లంరాజుకు స్థానం దక్కింది. ఈ సందర్భంగా పుల్లంరాజు పూజలో పాల్గొని మాట్లాడారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామి ఆలయం తర్వాత రెండో స్థానంలో బాటుకేవ్స్‌లోని అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తులు ఎక్కువగా వస్తారని తెలిపారు. ఈ దేవాలయంలో ఆది, సోమవారం నిర్వహించిన కుంబాభిషేకం, పడిపూజలో పాల్గొనే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. మలేషియా అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు కుప్పుస్వామి ఆధ్వర్యాన నిర్వహించిన పూజల్లో మలేషియా మంత్రి శర్వనణ్, మలేషియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోహిలం పిళ్లై తదితరులు హాజరయ్యారని తెలిపారు. భారత్ నుంచి అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.అయ్యప్పదాసు, ఏనుగుల బాలాంజనేయులుతోపాటు బెల్లపు హరిప్రసాద్, శంకరాచారి, కరకా సిద్దు, ఇస్లావత్ నగేష్ తదితరులు పాల్గొన్నారని పుల్లంరాజు వివరించారు.

ప్రెజర్‌బాంబు పేలి గిరిజనుడికి గాయాలు




క్షతగాత్రుడిని జట్టీలో తీసుకొస్తున్న గ్రామస్తులు

చర్ల: పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబు పేలడంతో చేపల వేటకు వెళ్లిన ఓ గిరిజనుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్‌స్టేషన్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన సబ్కా చంద్రయ్య చేపల వేట కోసం పామేడు శివారు ఉన్న చింతవాగు వద్దకు మంగళవారం బయలుదేరాడు. ఈ క్రమంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ప్రెజర్ బాంబును ఆయన గుర్తించకుండా తొక్కడంతో అది పేలి కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో చింతవాగు ఒడ్డున ఉన్న సీఆర్పీఎఫ్ 151 బెటాలియన్ అధికారులు తొలుత డ్రోన్ కెమెరాతో పరిస్థితులు పర్యవేక్షించాక అక్కడకు వెళ్లి క్షతగాత్రుడికి ప్రథమ చికిత్స అనంతరం భద్రాచలం ఏరియా వైద్యశాలకు తరలించారు.

మందుపాతరలను నిర్వీర్యం చేసిన పోలీసులు

పోలీసు బలగాలే లక్ష్యంగా మావోయిస్టులు ఏర్పాటు చేసిన రెండు శక్తివంతమైన మందుపాతరలను గుర్తించిన పోలీసు బలగాలు నిర్వీర్యం చేశాయి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా మిర్తూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మిర్తూర్ నుంచి తాయినార్ రహదారిపై పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా బెచాపాల్ సమీపాన ప్రధాన రహదారిపై ఐదు కిలోల సామర్థ్యం ఉన్న రెండు మందుపాతరలను గుర్తించారు. దీంతో బాంబు డిస్పోజబుల్ టీంను పిలిపించి మందుపాతరలను వెలికితీయించాక నిర్వీర్యం చేశారు. దీంతో పోలీసు బలగాలకు పెనుప్రమాదం తప్పినట్లయింది.

మొక్కజొన్న కొనుగోళ్లపై కసరత్తు



మొక్కజొన్నలను పరిశీలిస్తున్న సెర్ప్ అధికారులు

ఇల్లెందురూరల్: పొదుపు సంఘాల ఆధ్వర్యాన మొక్కజొన్న కొనుగోళ్లు చేపట్టేందుకు సెర్ప్ అధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇల్లెందు మండలంలోని మామిడిగుండాల గ్రామ పంచాయతీ పరిధి రైతులతో మంగళవారం సమావేశమయ్యారు. పొదుపు సంఘాల నుంచి ఎంపిక చేసిన ఫార్మర్ ప్రొడ్యూసర్ గ్రూపు ద్వారా మొక్కజొన్నలను ప్రభుత్వ మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్ విభాగం అధికారి మురళి, బెనిఫిషన్ అధికారి వినురుధ్, డీపీఎం సునందన్, మార్కెటింగ్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావుతోపాటు రవికుమార్, దుర్గారావు, సుభాష్, నాగేంద్ర, కొమ్మాలు, భూలక్ష్మి, సంపత్, రాంబాబు, మూర్తి, లాలయ్య, నందకుమారి, ప్రగతి, సుమతి, పాపారావు, భద్రయ్య పాల్గొన్నారు.